
# పరిష్కారం

టి. రామాచారి



ఇంకా తెల్లవారలేదు. అప్పుడే రాములమ్మొచ్చి "అమ్మా, పాలూ!" అని కేకేసింది.

ఆ కేక విన్న నా భార్య విమల వంటింట్లోంచే "ఆఁ, వస్తున్నా!" అంది. అన్నదే గానీ, ఎంతకూ బయటకు రాలా. పొయ్యిమీద కాఫీ మరుగుతోందని ఘుమఘుమలాడే వాసనే చెబుతోంది. సరే, నేను బయటకొచ్చా.

రాములమ్మ ఎర్రగా ఉంటుంది. అందంగా ఉంటుంది. ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తూ ఉంటుంది. చలాకీగా మాట్లాడుతుంది. ఆ మాటల్లో ధైర్యం, నవ్వులో ఆత్మస్థైర్యం కనిపిస్తుంటాయి. అలాంటి రాములమ్మ ఇప్పుడెందుకోగానీ నీరసంగా ఉంది. ఎందుకో కనుక్కుందామని...

"ఏం రాములమ్మా, అలా ఉన్నావేం?" అనడిగా.

"ఏం లేదయ్యగారూ ...!" అని ఆమె తల దించుకుంది. అయినా ఏదో అయిందనే అనిపిస్తోంది. అనుకోకుండా నా దృష్టి ఆమె ముంజేతులమీద పడింది. చూస్తే అక్కడుండాల్సిన బంగారు గాజులు

లేవు. మట్టి గాజులున్నాయి.

"అరే .... నీ బంగారు గాజులేవీ?" అనడిగితే, ఆమె ...

"అయ్యగారూ ....!" అని దుఃఖం ముంచుకొస్తుంటే మరేమీ అనలేకపోయింది.

"ఏమైంది రాములమ్మా, చెప్పు!" అని ఆప్యాయంగా అడిగా. నేనలా అడిగేసరికి ఆమె దుఃఖం బయటకొచ్చేసింది. ఆ దుఃఖంతో ఆమె ఇక నిల్చోలేక అక్కడే కూర్చునిపోయింది. కూర్చుని ఏడవటం మొదలెట్టింది. కడుపులోని దుఃఖమంతా కన్నీళ్ల రూపంలో కరిగిపోయిన తర్వాత ఆమె ఏడుపు తగ్గింది. కొంగుతో కళ్లొత్తుకుని ...

"అయ్యగారూ! ఇగ నేనా నర్సడితో యేగలేను! ఆడితో కాపురం జెయ్యలేను. ఇన్ని దినాల సంది వాడేం జేసిన వూకున్న. గెలిమిదేళ్ల సంది ఆడు తిడితే పడిన. కొడితే పడిన. ఎప్పుడో ఒగప్పుడు మార్తడని అనుకున్న. కానీ ఆడేం మారలా. ఇగేం మార్తడు? మారడు! నిన్న రేత్రి మళ్లీ నన్ను గొట్టిండు. నా జేతి గాజుల్ని గుంజుకుపోయిండు. తాగొచ్చి మళ్లీ తన్నిండు. యాడికని పడను? నా గ్గూడ మానం లేదా? రోసం లేదా? నా రెక్కల కస్టంమీన తింటడు. తాగుతడు. తినని గానీ. గా తాగుడేంది? నన్ను గట్ల గొట్టుడేంది?" అని మరోసారి కళ్లొత్తుకుని నా వైపు చూసింది. ఆ కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఆ చూపులో దైన్యం, నిస్సహాయత. నా కెలాగో అనిపించింది.

ఇంతలో విమల కాఫీ తెచ్చి నా కందించి, రాములమ్మను చూచి "ఏమైంది?" అనడిగింది.

నేను "ఏం లేదు, రాములమ్మకు కాఫీ పట్రా!" అంటే ఆమె మరో కప్పు తెచ్చి రాములమ్మకిచ్చింది. ఆ వేడి వేడి కాఫీ తాగేసరికి కొంత బలమొచ్చిందేమో రాములమ్మ తేరుకుంది. ముంగుర్లు సరిజేసుకుని ముక్కు తుడుచుకుంది. ఇంతలో విమల గిన్నె పట్టుకొస్తే పాలు పోసింది. ఇక వెళ్లిపోవటానికని లేవబోయింది. కానీ పాపం, లేవలేకపోయింది. ఎడంచేతిని పైకెత్తి అక్కడున్న కిటికీ ఊచను పట్టుకుని లేచింది. అప్పుడామె ముంజేతి గాజులు కణకణమన్నాయి. ఆ శబ్దం ఆమెనావరించిన నిశ్శబ్దాన్ని సచేతనం చేసినట్లనిపించింది. ఆమె కళ్లు తళుక్కున మెరిసి చురుగ్గా కదిలాయి.

తనేదో నిర్ణయానికొచ్చినట్టు నా వైపు తిరిగి, "అయ్యగారూ! తవరిప్పుడు నా యెంట రండి! మా యింటికొచ్చి నర్సడిని సూడుండ్రి. ఆడికి జర బుద్ధి సెప్పుండ్రి!" అంది.

ఆమె ఇంతగా అడుగుతుంటే నేను కాదనలేక, "సరే, పద!" అంటూ చొక్కా వేసుకుందుకు లోపలకెళ్లా.

మా మాటల్ని వింటున్న విమల "మీరెందుకండీ ఆ కుర్రదాంతో వెళ్లడం? వాళ్లు భార్యా భర్తలు! ఏదో గొడవ పడుతూంటారు. మళ్లీ కలుసుకుంటుంటారు. మధ్యన మీరు దేనికీ? ఇందులో చెడేదైనా అయితే అది మీకే అంటుతుంది!" అని మెత్తగా మొత్తింది.

అయినా నేను వినిపించుకోలా. చొక్కా వేసుకుని రాములమ్మ వెంట బయలుదేరాను.

వాళ్లిల్లు సాయిబాబా గుడి వెనక రైలుకట్ట అవతలుంది. మేమటే నడుస్తున్నాం. అప్పుడు చెప్పింది రాములమ్మ తన కథ.

తన పెళ్లప్పుడు నర్సింహకు తనవాళ్లు కట్నంకింద పదివేలిచ్చారు. తను కాపురానికొచ్చేప్పుడు కాళ్లకు వెండి గొలుసులు, మెట్టెలతోపాటు మెడలో బంగారు దండ, చేతులకు గాజుల(బంగారువే)తో వచ్చింది. కట్నం డబ్బుని నర్సింహ తాగుడు కింద ఖర్చు చేశాడు. యాదమ్మ గేదెలు కొనటానికని మెడలో గొలుసుని లాగేసుకుంది. ఇక తనకు మిగిలింది చేతి గాజులే. వాటినీ నర్సింహ నిన్న సాయంత్రం తనకిమ్మన్నాడు. తను ఇవ్వనుగాక ఇవ్వనని మొండికేసింది. దాంతో వాడు రెచ్చిపోయి తనను చితకబాది గాజుల్ని లాక్కుపోయాడు. వాటిని తెగనమ్మి పూటుగా తాగొచ్చాడు. వాడు తాగగా మిగిలిన డబ్బుని యాదమ్మ దాచేసింది.

"గిట్ల తాగి యాగీ చెయ్యొద్దని మీరు జర వాడికి సెప్పుండ్రి!" అని అర్థించింది. ఆ అభ్యర్థనతోపాటు ఆమె తన నిర్ణయాన్ని కూడా వినిపించింది. ఏమంటే, నా మాటలు విని వాడు మారితే మంచిదే. వాడితో తన కాపురాన్ని కొనసాగిస్తుంది. లేదా, వాడి నిహ తనొదిలేస్తుంది. వాడితో తెగతెంపులు చేసుకుంటుంది. తనొంటరిగానే బతుకుతుంది. అలా బతగ్గలననే ధైర్యం తనకుంది. ఇదీ ఆమె నాకప్పుడు చెప్పిన కథ. ఆమె కథ విని నాకాశ్చర్యమేసింది. రాములమ్మకు తన సొమ్ములు పొయ్యాయన్న బాధకన్నా తన మొగుడు ప్రయోజకుడు కాలేదన్న వ్యథే ఎక్కువున్నట్లనిపించింది.

మేము వాళ్ల గుడిసెకొచ్చేశాం. లోపలకెళ్లి చూస్తే నర్సింహ కుక్కి మంచంలో పడున్నాడు. ఒంటిమీద తెలివే లేదు వాడికి. గొంతులోంచి సన్నగా గురక వినిపిస్తోంది. ఇహ ఈ స్థితిలో నేను వాడికేం చెప్పనూ? లాభం లేదనుకుని వెనక్కి తిరిగా. అప్పుడే యాదమ్మ లోపలకొస్తోంది. నేను తమింట్లో ఉండటం చూచి ఆశ్చర్యపోయిందేమో


"అయ్యగారూ, తవరా?" అంది. నేనేదో అనబోయేంతలో ఆమె రాములమ్మ వైపు కోపంగా చూస్తూ "యేమే లం.... నర్సడి మీద అయ్యగారికి సెప్పినావే? ఆడు మగాడే! నీ మగడు! ఆడు నిన్నేం జేసిన జేస్తడు. తిడ్తడు, కొడ్తడు. అయ్యగారికి జెప్పితే ఆయనేం జేస్తడే?" అని కోడలిమీద విరుచుకుపడింది. ఆమెను అనరాని మాటలంది. తిట్టరాని తిట్లను తిట్టింది. అయినా రాములమ్మ ఒక్క మాటయినా అనలేదు. మౌనంగా నిల్చుండిపోయింది. ఆమె అలా ఏమీ అనకపోయేసరికి యాదమ్మ మరీ రెచ్చిపోయింది. ఆమె తిట్లు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇక సహనం నశించిన రాములమ్మ తనూ రెచ్చిపోయింది

"యేందీ? ఆడు మగాడా? నా మగడా! మగాడంటే గట్ల తాగుడేంది? మగడయితే గట్ల గొట్టుడేంది? నా కష్టం మీద బతుకుడేంది? మగాడయితే కష్టం జేయమను. కూసునబెట్టి నన్ను యేలుకోమను. గదేం లేదుగానీ, యెప్పుడూ తాగుడు! యెప్పుడూ గొట్టుడు! యీడేం మగాడూ. ఈడేం మగడు?"

వాళ్లలా గొడవ పడుతుంటే ఇహ నేనక్కడుండలేకపోయాను. ఇంటికి తిరిగొచ్చేశా. వచ్చానే గానీ, ఆ రోజంతా నా మనసెలాగో ఉంది. అనవసరంగా వాళ్ల విషయంలో తల దూర్చానే అన్న వ్యథ! విమల మాటలు వినకుండా వెళ్లి భంగపడొచ్చానే అన్న బాధ. నా కా రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. మళ్లీ తెల్లవారింది. మరో రోజు మొదలైంది.

ఆ రోజు పాలు పోయటానికి రాములమ్మొచ్చింది. కానీ, ఆమెలో మునుపటి చురుకుదనం లేదు. చిరునవ్వు లేదు. కళ్లలో అప్పటి కాంతి లేదు. ఈ రాములమ్మ వేరేననిపించింది. చందనపు బొమ్మలా ఉన్న రాములమ్మ రంపపు

ఈచీర డిజైను మీకు చాలా బాగుంటుందండీ.
ఎలాగుంటుందో చూడండి.



పొట్టు తీసేసిన బట్టబొమ్మలా అయింది. ఈమె వ్యథ తీరేదెలా? తీర్చేదెవరు? ... ఆలోచిస్తున్నా.

తాగుబోతు భర్తల్ని భరించలేక, అత్తల ఆగడాల్ని సహించలేక ఈమెలా తల్లడిల్లిపోతున్న రాములమ్మలు దేశంలో కోకొల్లలు! ఎవరికి వారు తమ సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవలసిందే గానీ, బయటి వారెవరో వచ్చి తీరుస్తారని ఆశించటం అవివేకం అనిపించింది నాకు. దాంతో ఇక ఆ విషయం ఆలోచించటం మానేశా.

ఆ మర్నాడు మా ఇంటికి రాములమ్మ రాలేదు. అత్త యాదమ్మ వచ్చింది.

"నీ కోడలు రాలేదేం యాదమ్మా?" అనడిగితే, ఆమె

"యెల్లిపోనాదయ్యగారూ! ఇగ రానంజెప్పి పోనాది!" అంది.

ఆశ్చర్యమేసింది నాకు. అన్నంతపనీ చేసిందన్నమాట రాములమ్మ. ఘటికురాలే అనుకున్నా. అప్పట్నుంచి యాదమ్మే మాకు పాలు పోస్తోంది.

ఆ తర్వాత ఒకనాడు మల్కాజిగిరి సెంటర్లో నర్సింహ కనిపించాడు. నేనే పలకరించా. నన్ను చూస్తూనే వాడు "దండాలండీ, అయ్యగారూ!" అన్నాడు. అన్నాడే గానీ, వాడి నోట ఆ మాటలు సరిగ్గా రాలా. తాగున్నాడు మరి. వాడి వాలకం చూసి నాకు కోపమొచ్చింది. ఆ కోపంతో వాడ్ని నాలుగు దులిపేశా. కష్టంజేసి నాలుగు రాళ్లు సంపాదించుకోమని చెప్పా. రాములమ్మని తెచ్చుకుని ఏలుకోమని చెప్పా. తాగుడు మాని, బుద్ధిగా మసులుకోమని చెప్పా. ఇలాంటివే ఇంకెన్నో చెప్పా. ఇవన్నీ వాడి చెవికెక్కవని నాకు తెలుసు. తెలిసే చెప్పా. చెప్పే విధంగానే చెప్పా. వాళ్లు నాకెన్నో ఏళ్లుగా తెలుసు. వాళ్లకి నేనెన్నో సార్లు సాయం చేశా. అందుకే వాడికీమాత్రం బుద్ధి చెప్పే చనువు నాకుందనే ధీమాతోనే వాడి నన్ని మాటలన్నా. నే చెప్పిందానికంతా వాడు 'ఊఁ' కొట్టి, చివరకు నాకో నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత నేను వాళ్ల విషయం మరిచిపోయాను.

ఓ లక్ష్మీవారంనాడు మేం భార్యాభర్తలమిద్దరం సాయిబాబా గుడికి పోయొస్తుంటే, భవానీనగర్ బస్‌స్టాప్ దగ్గర "అయ్యగారూ!" అనెవరో పిలిచారు. వెనక్కి తిరిగి చూశాను. రాములమ్మ!

ఆ మొహంలో మళ్లీ మునుపటి చిరునవ్వు. కళ్లల్లో మళ్లీ అప్పటి వెలుగు. మనిషిలో మళ్లీ అదే చురుకుదనం. తనూ గుడినుంచే వస్తుందేమో మొహాన విభూతి పెట్టుకునుంది.

"ఏం రాములమ్మా, బాగున్నావా?" అనడిగా.

ఆమె నవ్వుతూ, "బాగ్గుండానయ్యగారూ!" అని నవ్వుతూ విమలవైపు తిరిగి, "దండాలమ్మగారూ!" అని మళ్లీ తనే "నేనిప్పుడు అత్తతానుంటలేను!" అంది.

"అది తెలుసులే, ఎక్కడుంటున్నావు, ఏం చేస్తున్నావు?"

"సెంటరుకాడ కొత్త బ్యాంకి తెరవలే....., గండ్ల కొలువైంది!" అంది.

"నీకు బ్యాంకిలో ఏం పనే?" అని మా ఆవిడంటే,. "ఊడ్సుడు, కూజాలల్ల నీళ్లు నింపుడు. చాయ్‌లు దెచ్చిచ్చుడు ... గివే! ఇంగేం పన్లుంటవి?" అంది.

"ఒక్కదానివే ఉంటున్నావా రాములమ్మా?" అని విమల అంటే, "అవ్వమ్మా!" అని మళ్లీ నవ్వింది. ఆ నవ్వులో గర్వం, తనేదో సాధించానన్న తృప్తి!

"అన్నట్టు రాములమ్మా, అప్పుడెప్పుడో నరసింహ కనిపించాడు. నువ్వన్నట్టే వాడికి బుద్ధి చెప్పా. గట్టిగానే చెప్పాలే, కలిశాడా?" అనడిగా.

"కల్సిండయ్యా! తమరు తిట్టింరని కూడా సెప్పిండు. మీరన్నకాన్నుంచి తాగుతలేడంట. ఇగ నేను వాడితాన లేందానికి ఆడికి బుగులు బుట్టిందనుకోండ్రి. ఇంతల మీరు గూడ సెబితిరాయె. ఇప్పుడు మళ్లీ నాతానికొస్త నంటుండు. తాగకుండగ, నన్ను కొట్టకుండగ ఉండేట్టయితే రమ్మన్న!" అంది.

"మంచిదే. ఇద్దరూ కలిసి బుద్ధిగా కాపురం చేసుకోండి!" అని మేం అక్కడనుంచి కదిలాం.

దారిలో విమల "వేలెడంత లేదు, దానికెంత పొగరండీ! అత్తతో పోట్లాడింది. మొగుడినొదిలేసింది. ఏదో ఒక ఉద్యోగం చేస్తోంది. ఒంటరిగా ఉంటోంది. ఇప్పుడు కాపురానికి రమ్మంటే కండిషన్లు పెడుతోంది!" అంది.

"పొగరు కాదు, విమలా! అభిమానం. ఏ పనీ చెయ్యక, దాని సంపాదనతో తెగ తాగుతూ, రోజూ దాన్నే కొడుతుంటే అదెలా భరిస్తుంది చెప్పు! ఈ రాములమ్మే కాదు, ఆత్మాభిమానమున్న ఏ ఆడదీ భరించదు. భరించకూడదు!" అని అంటే,

"అవునండీ, బాగానే చెప్పారు!" అని విమల నవ్వింది.

ఇది జరిగి అప్పుడే మూడు నెలలయింది.

ఆ రోజు నేనింకా నిద్ర లేవకముందే, "అమ్మగారూ! పాలు! జున్ను పాలు బట్టుకోండ్రి!" అన్న రాములమ్మ కేక వినిపించింది.

రాములమ్మ రావటమేమిటని నేను నా నిద్ర మబ్బునొదుల్చుకుని బయటకొచ్చా.

స్టీలు గిన్నెలో పాలు పోయించుకుంటూ విమల "నీకు జున్ను పాలెక్కడివే రాములమ్మా?" అనడుగుతోంది.

"మా నర్సడు నా తాన్నే జేరిండిప్పుడు. నేను పంజేసే బ్యాంకిల అప్పు దీసుకుని రెండు బర్లు గొన్నం. గండ్ల ఒకటీనింది. ముందుగాల మీకు జున్నుబాలు బోస్తే మాకు మంచయిద్దని దెచ్చిన!" అని చిరునవ్వు చిందిస్తూ మెట్లు దిగి ఛెంగుఛెంగున ఎగురుతూ పోతోంది.

"ఉండు, ఉండవే! డబ్బులు తీసుకెళ్లు!" అని విమల అంటూంటే

"మీ తాన డబ్బులేంది? అయ్యగారు నా కాపురం నిలబెట్టింద్రు!" అని వెళ్లిపోయింది. అలా వెడుతున్న రాములమ్మ కాళ్లు భూమికే ఆనటంలేదు.

అప్పుడు చప్పున నా కో విషయం స్ఫురించింది. ఏమంటే, జీవిత గమనంలో ఈ రాములమ్మ వేసిన అడుగులు దేశంలోని వేలాది రాములమ్మల సమస్యలకు సమాధానం కాదా? అని!

■

